క్లుప్తంగా

రైల్వేగేటు మూసివేత



పిడుగురాళ్ల: మరమ్మతుల్లో భాగంగా శనివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలోని 23వ వార్డులోగల 65వ నంబర్ రైల్వే గేటును మూసివేశారు. వరుసగా మూడు రోజులపాటు ఈ రైల్వే లైన్ వద్ద కంకర రాళ్లు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నామని, ఇక్కడ వరుసగా శని, ఆది, సోమవారం వరకు మరమ్మతులు జరుగుతాయని గేటు వద్ద రైల్వే అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఇటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు రైల్వేగేటు దాటవద్దని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు.

రెంటచింతల ఎంపీడీఓగా శంకర్‌రావు

రెంటచింతల: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పెదప్రోలు శంకర్‌రావును నియమిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేయగా ఆయన స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణాజిల్లా ఆగిరిపల్లి మండలం నుంచి ఇక్కడకు రాగా ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలానికి బదిలీపై వెళ్లారు. అనంతరం శంకర్‌రావును కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలతో, స్థానిక వివిధ శాఖల అధికారుల సహకారంతో మండలంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పాలువాయి(రెంటచింతల): గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేద కుటుంబానికి ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని పాలువాయి గ్రామంలో సర్పంచ్ మందలపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు, కళ్లద్దాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌లను సర్పంచ్ విజయలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. కానుకమాత తిరునాళ్లకు కుటుంబంతో వచ్చిన చిరువ్యాపారి మిర్యాల శివ ప్రధాన రహదారి వెంబడి పిల్లలతో కలిసి ఉన్న సమయంలో గుర్తుతెలియని ఓ వాహనం వేగంగా వచ్చి వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మిర్యాల శివతో బాటు రాధిక, కర్తయ్య, ప్రిన్స్‌బాబు అనే ముగ్గురు చిన్నారులకు గాయాలు కాగా వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చట్టాలపై అవగాహన అవసరం



నరసరావుపేట రూరల్: విద్యార్థి దశ నుంచే వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏలూరు సునీత తెలిపారు. జొన్నలగడ్డలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో వినియోగదారుల చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తువులు కొను గోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారులు మోసం చేసినట్టు గమనిస్తూ టోల్ ఫ్రీ నెంబర్ 1915కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మోసాలకు పాల్పడే వ్యాపారులపై వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏంజెల్ ఫ్రైడ్ కంజ్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పిలి యజ్ఞనారాయణ, మండల విజిలెన్స్ కమిటీ సభ్యుడు షేక్ షాముల్లా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కారెంపూడిలో జరిగిన వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సావిత్రి



గిరిజనులకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

– కారెంపూడి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గురజాల: జాతీయ రహదారి పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గురజాల, పులిపాడు, దైద గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఏడీఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రెంటచింతల – గురజాల మధ్యలో విద్యుత్ సరఫరా పనులు చేస్తున్నారని కావున వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పలు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ



పులిపాడులో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల: పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొట్టిముక్కల, తేలుకుట్ల, దైద, పులిపాడు, గంగవరం గ్రామాల్లో పర్యటించి డ్వాక్రా సంఘాల మహిళలకు శనివారం రాత్రి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో మహిళల సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన తరువాత వారిని ఆదుకుంటానని సీఎం హామీ ఇచ్చారన్నారు. హామీకి అనుగుణంగా డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో రద్దు చేసి అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భారాన్ని తగ్గించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా మహిళలకు ఇచ్చినమేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. సామాజిక, ఆర్థికంగా మహిళలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిజర్వేషన్లకు మించి ప్రాధాన్యత ఇస్తూ మహిళలకు అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానంటూ మోసం చేసిన విషయాన్ని మహిళలకు గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందించడం జరుగుతుందన్నారు. మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. గ్రామాల్లోనే అన్ని వసతులు కల్పించి ప్రజలకు ఏ ఇబ్బందులు లేకుండా చూసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఎన్నో కష్టాలు పడాల్సివస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, కొమ్మినేని రవిశంకర్, జడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి,నాగరాజు యాదవ్, కటకం శిల్పరాజు, అక్కులు, తగుళ్ల పెద్ద పిచ్చయ్య, లక్ష్మయ్య, వెంకటరెడ్డి, రామిరెడ్డి,బండి శంకర్, చలవాది నారాయణ, పీర్ అహ్మద్, పాశం శ్రీనివాసరావు తదితరులున్నారు.

కష్టపడితే విజయం తథ్యం

ఏపీ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డి. దేవానందరెడ్డి

పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి శ్రమించి చదివితే విజయం ర్యాంకుల రూపంలో మీ చెంతకు చేరతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో 1984–85 పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో 'స్ఫూర్తి'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరు ఒత్తిడికిలోను కాకుండా, చదువుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి రోజు ప్రశాంతంగా 6 గంటలు నిద్రపోవాలని సూచించారు. ఇప్పటి వరకు తరగతి గదిలో పాఠాలు విన్నారు, ఇప్పుడు చదివి ప్రాక్టీస్ చేయాలని కోరారు. పాఠశాలలో తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు శ్రద్ధగా విని ఆ తర్వాత చదివి, ఆ తర్వాత రాసి, ఆ తర్వాత ప్రాక్టీస్ చేస్తే ర్యాంకులు సాధిస్తారని సూచించారు. పరీక్షలు రాసే సమయంలో సమయం వృథా కాకుండా ప్రశ్నపత్రాన్ని చదివి ముందుగా వచ్చిన వాటిని శ్రద్ధగా రాయాలన్నారు. సమయం ఉంటే అదనపు ప్రశ్నలకు ఆన్సర్లు రాయమని సూచించారు. సమయస్ఫూర్తి చాలా ముఖ్యం, వీటిని విద్యార్థి దశలోనే పాటిస్తే జీవితంలో ఎన్నో విజయాలతో ముందుకు వెళ్తారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలాడటం, వ్యాయామం చేయటం, యోగాలు చేయటం వంటివి చేస్తే ఆరోగ్యకరంగా ఉంటారని సూచించారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. మార్కులు జీవితం కాదని, ఒత్తిడికి లోబడి పరీక్షలు రాయవద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు. తొలుత పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ పాఠశాలలో 370 మంది 10వ తరగతి విద్యార్థులు ఉండటంతో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి సలహాలు అందజేశారు. అనంతరం 1984–85 పదో తరగతి పూర్వ విద్యార్థులు దేవానందరెడ్డిని దుశాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ, యూటీఎఫ్, విద్యా శాఖ తరపున ఎంఈఓ ఓ.రాజు దేవానందరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వర్లు, ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్‌వీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, పీజీకే మోహన్‌రావు, రాజు మాస్టారు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- శంకరపురంలో 75 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ



శంకరపురంలో మహిళకు ఇంటిపట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ప్రజా సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాల్సిన అవసరం ఉందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని శంకరపురంలో 75 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే కాసు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ... జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చంద్రబాబు, అండ్ గ్యాంగ్ ప్రచారం చేస్తున్నారని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇవన్ని రద్దు చేస్తే ప్రజా సంక్షేమం కుంటుపడుతుందన్నారు. ప్రజలంతా చంద్రబాబు చేస్తున్న కుట్రలు గమనించాలని, ప్రజా సంక్షేమ పాలనా కొనసాగేందుకు ప్రజలంతా వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో మీరంతా కోరుకున్న సంక్షేమ అభివృద్ధి పాలన అందించామని, చంద్రబాబు, జగనన్న పాలనలో ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. జన్మభూమి కమిటీలతో సంబంధం లేకుండా పథకాలన్నీ వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికి చేర్చిన పాలన జగనన్నదన్నారు. లంచాలు, సిఫారసులతో కూడిన దుర్మార్గమైన పాలన చంద్రబాబుదని ఎమ్మెల్యే కాసు అన్నారు. చంద్రబాబు అండ్ గ్యాంగ్ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని, ఇచ్చిన మాటను ఇచ్చినట్లుగా నేరవేర్చిన జగనన్నకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీ కందుల జాను, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వట్టెం యలమంద, నాయకులు సురేష్, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం..

గురజాల: గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడం జరిగిందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభం, తేలుకుట్లలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, సీసీ రోడ్డు, దైద గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం, పులిపాడు గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటుతో పాటు సిమెంటు రోడ్లు, గంగవరంలో సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో సహకరించడం జరిగిందన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు సమకూర్చి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటికే..

– డీఎల్‌డీఓ గబ్రూనాయక్



రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యసహాయం అందించేందుకు అందచేస్తున్న రూ. 25 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిని తక్షణమే ఇంటికి పంపించడం జరుగుతుందని డీఎల్‌డీఓ గబ్రూనాయక్ హెచ్చరించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు, ఆరోగ్య సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అధికారులకు ఖచ్చితంగా వలంటీర్లు సహకరించి ఆరోగ్యశ్రీ కార్డులను, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డులను(పీఎంజేఏవై) పంపిణీ చేసేందుకు, గ్రామాలలో జరుగుతున్న కులగణనకు సహకరించాలన్నారు. వలంటీర్లు అధికారులు ఒకరికొకరు సహకరించుకుని మండలాన్ని జిల్లాలో టాప్‌లో ఉండేలా కృషి చేయాలన్నారు. మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 10,448 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, 13,120 మందికి పీఎంజేఏవై కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రేపు జేఎన్‌టీయూలో ప్రారంభోత్సవాలు

నరసరావుపేట రూరల్: కాకానిలోని జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను ఈనెల 5వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలోని అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు, వైద్య ఆరోగ్య శాఖామంత్రి విడదల రజని, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డి, వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

దుర్గి: నవరత్నాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలను అందజేసింది. వారందరికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. శనివారం మండలంలోని అడిగొప్పల గ్రామంలో లబ్ధిదారులకు పట్టాల రిజిస్ట్రేషన్‌లు నిర్వహించారు. మండలవ్యాప్తంగా ఆయా గ్రామ రెవెన్యూ అధికారి, సెక్రటరీలకు ప్రత్యేక అధికారాలు కల్పించిన ప్రభుత్వం అక్క చెల్లెమ్మలకు వారి పేరిట రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎటువంటి రుసుము లేకుండా ప్రభుత్వమే తమకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయటంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో మహిళలతో కోలాహలం నెలకొంది. సాంకేతిక సమస్యలను అధిగమించి గడువు తేదీలోపు లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తామని డిప్యూటీ తహసీల్దార్ ఐ.ఫణీంద్ర పేర్కొన్నారు. శాశ్వత హక్కులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పరిశీలన..

పిడుగురాళ్లరూరల్: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బారావు అన్నారు. మండలంలోని కామేపల్లి, బ్రాహ్మణపల్లి, వీరాపురం గ్రామాల్లో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. సచివాయాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఆన్‌లైన్‌లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని పరిశీలించారు. పంచాయితీ సెక్రటరీలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ముప్పూరి వెంకట్రావమ్మ, వెంకటప్పయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలకు సీఎం జగన్ అండ

దాచేపల్లి: ముస్లిం, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ. మైనార్టీలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పటివరకు ప్రకటించిన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఏడుగురు మైనార్టీ అభ్యర్థులకు సీఎం వైఎస్ జగన్ అవకాశం కల్పించారని, మైనార్టీలందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేసిందని, వైఎస్సార్‌సీపీ మాత్రం ముస్లీం, మైనార్టీలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తుందన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, మైనార్టీ విభాగం మండలశాఖ అధ్యక్షుడు సయ్యద్ మౌలాలీ, నాయకులు షేక్ సైదా, నాయకులు షేక్ సైసావలి, షేక్ డాడీ, మున్నా, గన్నుబుడే, సైదా, రఫీ, జలీల్, సుభాని, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 98శాతం పూర్తి



ఏకోనామం పేటలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాధవి

మాచర్ల రూరల్: అవ్వా తాతలు, వితంతు, దివ్యాంగులు వివిధ రకాల చేతివృత్తుల వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్ డబ్బులను అందజేశారు. శనివారం నాటికి మాచర్ల మండలంలో 98శాతం పింఛన్ పంపిణీ కార్యక్రమం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మూడు రోజుల్లోనే 98శాతం పూర్తి చేయగా మరో రెండు రోజుల్లో మిగిలిన వారి వద్దకు వెళ్లి నూరుశాతం పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. గత ప్రభుత్వం చంద్రబాబు హయాంలో పింఛన్ దారులు తమకొచ్చే అరకొర డబ్బులు తీసుకోవటానికి ఇంటి నుంచి కి.మీ.నడిచి వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఏ రోజు పంపిణీ జరుగుతుందో తెలియక, ఎప్పుడో పింఛన్ వస్తుందో అర్థం కాక ఆందోళనతో ఎదురుచూసేవారు. పంపిణీ జరిగే రోజున గంటల తరబడి వేచి చూసే దుస్థితి ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వచ్చిన తరువాత 1వ తేదీన తెల్లవారుఝామునే ఇంటి తలుపుతట్టి అవ్వాతాతలకు వలంటీర్లు చిరునవ్వుతో పింఛన్‌ను అందిస్తున్నారు. దీంతో ఆ కుటుంబాలలో ఆనందం వెల్లివిరుస్తుంది.

భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవం



ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తేరుపై తిరుకుటుంబ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రెంటచింతల: కానుకమాత చర్చి 174వ వార్షిక మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 10.30 నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు గ్రామపురవీధులలో కథోలికులు భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై తిరుకుటుంబ విగ్రహంతో కానుకమాత చర్చినుంచి బ్రహ్మయ్య బావిసెంటర్, ఉట్లస్తంభాల సెంటర్, తిరుహృదయ మందిరం, లూర్దుమాత గుడి మీదుగా సుమారు 11 గంటల పాటు మేళతాళాలతో భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా భక్తి గీతాలను ఆలపించారు. ముందుగా కానుకమాత చర్చి ఆవరణలో సుమారు గంటన్నర సేపు కాల్చిన పలు నూతన రకాల బాణసంచా వేలాదిమంది భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి, సహాయగురువులు అగస్టీన్ నేతృత్వంలో వందలామంది భక్తులు, చర్చిపెద్దలు ఈ తేరోత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి నేతృత్వంలో 100 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు

గురజాల: సామాజిక న్యాయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. స్థానిక పంచాయతీ రాజ్ బంగ్లాలో బీసీ సంఘం నేతల ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను ఎంపికచేయడంపై బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో అనిల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి తీరుతామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనివ్వడం జరిగిందన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంద్రెయ్య, బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు చల్లా కాశీబాబు, మహిళా నాయకురాలు యహంకాళీ యశోదదుర్గా, కె.గిరిబాబు, షేక్ పీర్ అహ్మద్, మైనార్టీ నాయకుడు షేక్ నాగులుమీరా, చిలకపాటి బ్రహ్మయ్య తదితరులున్నారు.

లింగ నిర్ధారణ చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట: లింగ నిర్ధారణ చట్టం–1994ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ ఆథారిటీ, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం శనివారం నిర్వహించారు. కమిటీ సభ్యులతో మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం 1994ను సమర్థంగా అమలు చేయాలని అన్నారు. ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చేయుట చట్టరీత్యా నేరమని, ఆపని చేసినట్లు రుజువైతే చట్టపరిధిలో శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 161 ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా లో నూతనంగా నాలు గు స్కాన్ సెంటర్లకు, 10 రెన్యువల్స్‌కు, తొమ్మిది మార్పులకోసం దరఖాస్తు చేసు కున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేశామన్నారు. డీఎండీహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గీతాంజలి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.